మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామికి ప్రత్యేకంగా కోడెమొక్కులను భక్తులు చెల్లించుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో మూడు రోజుల పాటు అర్జిత సేవలు రద్దు చేసి నిరంతర దర్శనాలను కల్పించారు. గురువారం రాత్రి 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాలు, అలాగే తెలంగాణ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం రాత్రి 9 గంటలకు నిశిపూజ భక్తులకు లఘు దర్శనం, కోడెమొక్కులను కొనసాగించారు. శుక్రవార మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 12 నుంచి 3 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం, 3.30 గంటల నుంచి 4 గంటలవరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు, 4 గంటల నుంచి 4.25 వరకు సుప్రభాతం, 4.25 నుంచి 6 గంటల వరకు ప్రాతకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం కల్పించారు. సాయంత్రం 4 గంటలకు శివదీక్ష స్వాముల దర్శనానికి కల్పించారు.

మహాలింగార్చన..

మహాశివరాత్రి పర్వదినంలో మహాఘట్టమైన మహా లింగార్చన శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభిస్తారు. రాత్రి 11.35 నిముషాలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. శనివారం చివరి రోజు భక్తుల మొక్కుబడులు, అర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి.

విద్యుత్ దీపాలతో అలంకరణ..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవాలయాలు విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా మారాయి. ప్రధాన దేవాలయంలో తీరొక్క పూలలో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్‌కు చేరుకోవడానికి ఆర్టీసీ అధికారులు 900 బస్సులను నడుపుతున్నారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు 14 ఉచిత బస్సులను ప్రారంభించారు. భక్తులు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి 8 చోట్ల స్థలాలు ఏర్పాటు చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

గ్యారంటీలను అమలు చేసే శక్తి ఇవ్వాలని వేడుకున్నాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/వేములవాడ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలు జరిపే శక్తిని ఇవ్వాలని మహాశివరాత్రి సందర్భంగా శివుడిని వేడుకున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ మహాశివరాత్రి సందర్భంగా శ్రీస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. ప్రభుత్వాలు ఏవి వున్న, మేము అధికార పక్షంలో వున్న, ప్రతి పక్షంలో వున్న సర్వేజన సుఖినో భవంత్ అందరు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అన్నారు. స్వయంగా మహా శివరాత్రి జాతరకు ముఖ్యమంత్రి రావాల్సివుండేది, ఢిల్లీలో వున్న సమావేశాలతో రాలేకపోయారు. ఎన్నికల కోడు అమలులోకి రాకపోతే వారం రోజుల్లో వేములవాడను సందర్శించి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. రాజన్న భక్తుడిగా వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కని విని ఎరగని రీతిలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు చేశామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు సైతం సేవతో పని చేస్తున్నారని తెలిపారు.

జాతరకు భారీ బందోబస్తు..

మహా శివరాత్రి జాతరలో ఏలాంటి సమస్యలు తలేత్తకుండా భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకునే విధంగా భారీ పోలీస్ బందోబస్తు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 1400 మంది పోలీస్ సిబ్బందితో పాటు అన్నీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు.

భక్తులకు సేవ పూర్వ జన్మ సుకృతం

వేములవాడ టౌన్, మార్చి 7 : భక్తులకు సేవ చేసే భాగ్యం రావడం పూర్వజన్మసుకృతమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మహాశిరాత్రి జాతర సందర్భంగా గురువారం ఆర్టీసీ డిపోలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినీ బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని క్యూలైన్‌లను, చలువ పందిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరకు పేద, నిరుపేద భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారన్నారు. మహాదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ ఆధ్వర్యంలో సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయ పార్కింగ్ స్థలం వరకు 14 ఉచిత మినీ బస్సు లను ప్రయాణికుల కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఉచిత బస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఉచిత మినీ బస్సులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● **భక్తులకు ఉచిత అల్పాహారం**

మహాశివరాత్రికి వచ్చే భక్తులకు రాజరాజేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఉచిత అల్పాహార సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఖాళీ కడుపుతో ఉండకూడదని అల్పాహారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, డిపో మేనేజర్ మురళీకృష్ణ ఉన్నారు.

ఏసియన్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 7: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 8,9,10 తేదీల్లో జరుగనున్న 22వ అండర్-20 జూనియర్ ఏసియన్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ఎం.వినయ్ 1500 మీటర్లు, 3000 మీటర్ల స్టిపల్ చేస్, పి.విష్ణువర్ధన్ 10వేల మీటర్ల రేస్ వాక్‌లో గత సంవత్సరం జాతీయ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చాటిన కారణంగా ఈ పోటీలకు అర్హత సాధించారని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ పోటీల్లో కనబరిచే ప్రతిభ ఆధారంగా దుబాయ్‌లో ఏప్రిల్ 24 నుంచి 27వరకు జరుగబోయే జూనియర్ ఏసియషన్ అండర్-20 చాంపియన్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఈ క్రీడాకారులను కోచ్ వరుణ్‌ను డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 7: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సు కిందపడడంతో ఓ ప్రయాణికుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన అంకం చంద్రయ్య అనే చేనేత కార్మికుడు గురువారం వ్యక్తిగత పని నిమిత్తం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తున్నాడు. గ్రామంలోని యాదవనగర్ బస్టాండ్ వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి కిందపడిపోయాడు. అతడి కాలుపై నుంచి బస్సు టైరు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జయింది. 108లో కరీంనగర్‌కు తరలించారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7, 550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 51మంది రైతులు 773క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించారు. శుక్రవారం నుంచి మూడు రోజులు సెలువుగా అధికారులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, మార్చి 7: కరీంనగర్ బస్టాండ్‌లో ఒక మహిళా ప్రయాణికురాలి హాండ్ బ్యాగ్‌లో నుంచి పద్దెనిమిదిన్నర తులాల బంగారం చోరీ అయింది. ఈ మేరకు బాధితురాలు ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆకునూర్ ఘనపురంకు చెందిన మెల్లం కొమురమ్మ అనే మహిళ మూడు రోజుల కిందట తన కొడుకు వద్దకు గోదావరిఖని సెంటనరీ కాలనీకి వెళ్లింది. తిరిగి స్వగ్రామం అకునూర్ ఘనపురంకు వెళ్లేందుకు గురువారం ఉదయం 9:30 గంటలకు మంథనిడిపో బస్సులో కరీంనగర్‌కు చేరుకుంది. ఆ తరువాత కరీంనగర్ బస్టాండ్‌లో హుస్నాబాద్ బస్సు ఎక్కుతున్న సమయంతో రద్దీగా ఉండి కొందరు నెట్టే ప్రయత్నం చేశారు. తీరా బస్సులోకి వెళ్లిన కొమురమ్మ తన బ్యాగ్ జిప్ తెరచి ఉండడాన్ని గమనించింది. లోపల మరొక చిన్న బ్యాగ్‌లో భద్రపరిచిన బంగారు ఆభరణాల కోసం వెదికింది. ఆ బ్యాగ్ కనపడలేదు. దీంతో రోదిస్తూ పోలీసుల వద్దకు చేరింది. బస్సులో వచ్చే సమయంలో లేదా కరీంనగర్ బస్టాండ్‌లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన పద్దెనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను చోరీ చేశారని బాధితురాలు తెలిపింది.

వడదెబ్బతో రైతు కూలీ మృతి

వీణవంక, మార్చి 7: కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన నేరుకుంట్ల పర్శరాం (45) అనే వ్యక్తి వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. మధ్యాహ్నా పర్శరాం వరి పంటకు ఎరువు చల్లుతున్నాడు. ఎండవేడిమికి ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడ ఉన్న వారు 108కి సమాచారం అందించారు. సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం

సారంగాపూర్, మార్చి 7: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బ రాజన్న ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అత్యంత సుందరంగా రంగురంగుల పూలతో అలంకరించిన కల్యాణ వేదికపైకి స్వామి వారి ఉత్సవమూర్తులను ఆసీనులుగావించారు. ఈ సందర్భంగా అర్చకులు రామోజుల చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో దుబ్బ రాజరాజేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వం తరఫున స్వామి వారికి ఆర్డీవో మధుసూదన్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వార్ల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అదూలరి అనూష, తహసీల్దార్ రమేష్, ఆలయ ఫౌండర్ పొరండ్ల శంకరయ్య, ఆలయ ధర్మకర్తలు కొంద్ర రాంచందర్‌రెడ్డి, వాసం శ్రీనివాస్, పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజన్నను దర్శించుకున్న దేవదాయశాఖ కమిషనర్

వేములవాడ టౌన్, మార్చి 7: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని ఆలయానికి వీచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలి కారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామి వారి అద్దాల మండపంలో కమిషనర్‌కు అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శాలువతో సన్మానించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

అడవి జంతువు మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

రాయికల్, ఫిబ్రవరి 7: మండలంలోని రాజనగర్ గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తిని అటవీ శాఖ అధికారులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తన వ్యవసాయ పొలం చుట్టూ కరెంట్ తీగలు అమర్చగా ఈ నెల 5న అడవి జంతువు సాంబారు మృతి చెందింది. దీంతో రాజన్నపై అటవీ శాఖ అధికారులు అటవీ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, మార్చి 7: రోడ్డు ప్రమాదం కేసులో ఎల్లారెడ్డిపేటకు చెందిన భూక్య శ్రీనివాస్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 12 జూన్ 2018న ఎల్లారెడ్డిపేటకు చెందిన మాలోతు తుకారాం తన స్నేహితుడితో కలిసి కారులో సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ముస్తాబాద్ మండలంలోని బద్దనకల్ వద్ద కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తుకారాం తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కారు నడిపిన శ్రీనివాస్‌పై కేసునమోదు చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ సందీప్ వాదించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి డ్రైవర్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 3వేల జరిమానా విధించారని ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చంపుతామని బెదిరించిన ముగ్గురికి...

సిరిసిల్ల క్రైం, మార్చి 7: సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో ఉంటున్న దూడం సరస్వతి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన చిట్యాల మధు, నాయిని శంకర్, దుబ్బ నీరజకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... 28 జనవరి 2015న శాంతినగర్‌లోని దూడం సరస్వతి ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించారు. రూ. 25లక్షలకు ఆమె భర్త ఇల్లు అమ్మాడని, మిగతా రూ. 5 లక్షలు తీసుకొని వెళ్లిపోవాలని తీవ్రంగా దూషించి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ చీనా నాయక్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో చార్జి షీట్ దాఖలు చేయగా పీపీ చెలుముల సందీప్‌కుమార్ వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌లో
కరీంనగర్ రీజియన్‌కు ప్రథమ స్థానం



పురస్కారం అందుకుంటున్న ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, మార్చి 7: తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ పండుగలకు నిర్వహించిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో కరీంనగర్ రీజియన్‌కు ప్రథమ స్థానం లభించింది. రెండె స్థానంలో మహబూబ్‌నగర్, మూడో స్థానంలో నిజామాబాద్ నిలిచాయి. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీకళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత సన్మానంతో పాటు, ట్రోఫి, లక్ష రూపాయల పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎం సుచరితమాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల సమష్టి కృషితోనే అవార్డు దక్కిందన్నారు. రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో పనిచేసి సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కరీంనగర్ జోన్ వినోద్‌కుమార్, డిప్యూటి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్లు మల్లేశం, మల్లయ్య, మనోహర్, వేదవతి, నర్సప్ప, నాగభూషణం, అర్పిత, తదితరులు పాల్గొన్నారు.

శివార్చన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 7: మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి గుడి చెరువు ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన శివార్చన సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం రాత్రి ప్రారంభించారు. కళాకారులు ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి, భీమ్యానాయక్, చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు సాగరం వెంకటస్వామి, కనికరపు రాకేష్, చిలివేరి శ్రీనివాస్, పిల్లి కనుకయ్య, తూమ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం

వేములవాడ టౌన్, మార్చి 7: మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అంతకుముందు మంత్రి పొన్నంకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయాధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో డిప్యూటీ ఈవో లోకనాథం పట్టు వస్త్రాలను సమర్పించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, భీమ్యానాయక్, ఈవో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోసం 3 లక్షల లడ్డూ ప్రసాదం

వేములవాడ టౌన్, మార్చి 7 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించే మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆలయాధికారలు లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించడంతో ప్రసాదాల సెక్షన్ సూపరిండెంట్ రాజశేఖర్ ఎప్పటికిప్పుడు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 3 లక్షల వరకు లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించడంతో సిబ్బంది సిద్దంగా ఉన్నారు. అభిషేకం లడ్డూ రూ. 100, సాధారణ లడ్డూ రూ.20 చొప్పున, పులిహోర ధరను రూ. 15గా నిర్ణయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో పాత ఆంధ్రబ్యాంకు, వాహనాల షెడ్డు వద్ద కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రోడ్డు సమస్యపై రైతుల మధ్య ముదురుతున్న వివాదం

చందుర్తి, మార్చి 7 : మండలం లింగంపేటలో పంట చేలకు వెళ్లే రోడ్డు సమస్యకు ఏడాదిగా పరిష్కారం లభించకపోవడంతో కొంతమంది రైతులు రోడ్డుకు అడ్డంగా కంచె వేశారు. దీంతో వివాదం ముదురుతోంది. గ్రామంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి నుంచి పంట చేలకు వెళ్లే రోడ్డు ఏడాదిగా ఇరు వర్గాల రైతుల మధ్య వివాదం నెలకొంది. ఈ రోడ్డు విషయంలో గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాల రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటి నుంచి రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంతో కొంతమంది రైతులు గురువారం రోడ్డుకు అడ్డంగా కంచె వేశారు. ధర్నా చేసేందుకు టెంటు వేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ విచారణ చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

చందుర్తి మార్చి 7 : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీపీ బైరవని లావణ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా వేసిన బోర్ ద్వారా నీటి సరఫరాను ప్రారంభించారు. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులి రేణుకసత్యం, సింగిల్ విండో చైర్మన్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు బత్తుల కమలాకర్, భైరగోని రమేష్, ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

శివాలయంలో బ్రహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 7: ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌లో వేములవాడ రాజరాజేశ్వర దత్తత దేవాలయమైన శివాలయంలో మూడు రోజులగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభానికి నందీశ్వరుని చిత్రపటాన్ని కట్టి దేవతలను ఆహ్వానించే పూజలు చేశారు. అనంతరం మహిళలు, భక్తులు, అర్చకుల సమక్షంలో హోమం నిర్వహించారు. రామాలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు దొమ్మాటి నర్సయ్య, నిమ్మ లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ అపెరా సుల్తానా, నిమ్మ సుధాకర్ రెడ్డి, మోతే లక్ష్మారెడ్డి, బొమ్మిడి భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 7 : విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలని, భయం లేకుండా పరీక్షలను రాసి ఉత్తీర్ణత సాధించాలని సినీగేయ రచయిత వడ్డెపల్లి కృష్ణ అన్నారు. గతేడాది పదోతరగతిలో 10జీపీఏ సాధించిన బూర్ల శ్రీలత, 9.8 జీపీఏ సాధించిన పిట్ల తేజస్వినికి వడ్డెపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రతిభ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని లోకిని శారద పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

బోయినపల్లి, మార్చి 7: సమాజంలో మహిళల పాత్ర కీలకమైందని బోయినపల్లి ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్ అన్నారు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహిం చారు. విలాసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులను సన్మానించారు. తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జయశీల, ఏవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై నాయకుల హర్షం

వేములవాడ రూరల్, మార్చి 7: వేములవాడ అర్బన్ మండలంలో ఎస్డీఎఫ్, ఈజీఎస్ నిధులు రూ.కోటి 15 లక్షల 10వేల మంజూరు కావడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఎంపీటీసీ బాస రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, జిల్లా ప్రధానకార్యదర్శి ముడికె చంద్రశేఖర్, నాయకులు కదిరె రాజ్‌కుమార్, పండుగు ప్రదీప్, ఎర్రం ఆగయ్య, వనపట్ల ప్రభాకర్ రెడ్డి, ఎట్ల నరసింహరెడ్డి, వంగ పర్శరాములు, కత్తికనుకయ్య పండుగు పర్శరాములు, ఎర్రం సత్తయ్య, బోనాల రమేష్, ఇటిక్యాల లింగయ్య, షేర్ల మల్లేశం, చెట్ల శ్రీనివాస్, ఎస్కే ఇమామ్, ఎర్రం లత, వనపర్తి దేవరాజు, మారం రాములు పాల్గొన్నారు.

పంటలకు ఎల్లంపల్లి నీరందించాలి

చందుర్తి, మార్చి 7 : పంటలు ఎండిపోకుండా ఎల్లంపల్లి కాలువ ద్వారా సాగు నీరు అందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలంలో నీరు అందక ఎండిపోయిన వరి పంటను, ఎల్లంపల్లి కాలువను గురువారం పరిశీలించారు. నీటిని విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మరో పది రోజుల్లో చేతికొచ్చే పంట కళ్ల ముందు ఎండిపోతుంటే రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. వెంటనే ఎల్లంపల్లి నీటిని చందుర్తి మండలంలోని అన్ని చెరువుల్లో నింపాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేష్, మండల నాయకులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, పేరుకు గంగరాజు, చింతకుంట సాగర్, మర్రి రాజు, పేరుకు రంజిత్, తిప్పని భూమేష్, కూతురు మహేందర్ రెడ్డి, లింగాల పెద్దిరెడ్డి, మర్రి రాజేశం, సిరికొండ తిరుపతి, బాలవేణి మహేష్ లింగంపల్లి లక్ష్మణ్, లింగంపల్లి హరీష్, భత్తుల మధు, బత్తుల జ్యోతి, మెడికలసుభాష్, మోత్కుపల్లి నరేష్, ఒట్టేల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమా?

సిరిసిల్ల టౌన్, మార్చి 7: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపైన బీఆర్ఎస్ నాయకులకు నిజంగా ప్రేమ ఉంటే వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణమైన ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమా? అని లాల్ బాహుట చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన జిల్లా కార్యదర్శి పంతం రవి సవాల్ విసిరారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 365 రోజుల పాటు కార్మికులకు పనిదినాలు కల్పించాలని బకాయిలను విడుదల చేయాలని, బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇవ్వాలని కొందరు బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో డిమాండ్ చేయడం దురుదృష్టకరమన్నారు. పదేళ్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని, అప్పుడు ఏం చేసిందని ప్రశ్నించారు. సిరిసిల్ల నేత కార్మికులకు 365 రోజుల పనిదినాలు ఎందుకు కల్పించ లేక పోయిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలను ఎందుకు చెల్లించలేదన్నారు. శాసన సభ సమావేశాలలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ గురించి ఒక్క మాట కూడా మాట్లాడని కేటీఆర్ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సిరిసిల్లలో నేత కార్మికులను ఓట్లు అడగడానికి ఎలా వస్తారన్నారు. సమావేశంలో లాల్ బాహుట చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా నాయకులు సామల మల్లేశం, నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 7: మహాశివరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో నెముళ్ల గుట్ట మల్లిఖార్జున స్వామి ఆలయంలో మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం, బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. 1వ వార్డు కౌన్సిలర్ పోచవేని సత్య ఎల్లయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ నుంచి ఆలయం ముందు హైమాస్ట్ లైట్లను ఏర్పాటుతో పాటు ప్రధాన రోడ్డు నుంచి ఆలయం వరకు వీధి దీపాలను వేయించారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని గంగాధర ఆలయం, వల్లంపట్ల విశ్వనాథ ఆలయం, జంగమరెడ్డిపల్లె రామలింగేశ్వరస్వామి ఆలయం, అనంతగిరి, అనంతారం, రేపాక గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలంలోని తాడురు, తంగళ్లపల్లి శివాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో అలంకరించారు. శివపార్వతుల కళ్యాణం, అన్నదానం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

వేములవాడ రూరల్: మండలంలోని నాగాయపల్లి దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.


మల్లికార్జున స్వామి దేవాలయం

చందుర్తి : మండలంలోని ఎన్గల్, మూడపల్లి గ్రామంల్లోని రాజరాజేశ్వరస్వామి, చందుర్తిలోని భక్త మార్కండేయ స్వామి ఆలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. ఎన్గల్‌లో శనివారం ప్రత్యేక పూజలుపాటు శివకల్యాణం, రుద్రభిషేకం అన్నాదానం నిర్వహించనున్నారు.


రుద్రంగిలోని బుగ్గరాజరాజేశ్వరస్వామి ఆలయం

కోనరావుపేట: మహా శివరాత్రి సందర్భంగా కోనరావుపేట మండలం మామిడిపల్లిలోని శివాలయాన్ని ముస్తాబు చేశారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని బుగ్గరాజరాజేశ్వరస్వామి ఆలయం, శివ భక్తమార్కండేయ ఆలయం, మానాల శంభులింగేశ్వర స్వామి ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.


మామిడిపల్లిలో ముస్తాబైన ఆలయం


తాడూర్‌లో ముస్తాబైన శివాలయం


నాగాయపల్లి దుబ్బరాజేశ్వరస్వామి

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వం


ధర్నాలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్ /వేములవాడ టౌన్, మార్చి 7 : కోర్టు మాటలను పెడచెవిన పెట్టి కేంద్ర ప్రభుత్వానికి ఎస్‌బీఐ వత్తాసు పలుకుతోందని వేములవాడ పట్టణంలో ఆ బ్యాంకు ఎదుట కాంగ్రెస్ నేతలు, నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్దమని భావించి ఇటీవల సుప్రీంకోర్టు నిషేధించిందన్నారు. కేంద్రప్రభుత్వం పూర్తి ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు సంద్రగిరి శ్రీనివాస్, పాత సత్యలక్ష్మి, చిలు రమేష్, సాగరం వెంకటస్వామి, ఇప్పపూల అజయ్, తూమ్ సంతోష్, కనికరపు రాకేష్, పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆదేశాలను కేంద్ర ప్రభుత్వం భేఖాతరు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సిరిసిల్ల పట్టణం ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసీ, బ్యాంక్‌లను ప్రైవేటీకరించేందుకు కుట్ర పన్నుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం ఎస్‌బీఐలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 25వేల 500 కోట్లు ఎన్నికల విరాళాలుగా వసూలు చేస్తున్న పరిస్థితులను సుప్రీం కోర్టు తప్పు బడుతూ ఒక తీర్పు ఇచ్చిందన్నారు. 2024 మార్చి 6నాటికి(బుధవారం నాటికి)ఎస్‌బీఐలోని నిధుల వివరాలను బయట పెట్టాలని సుప్రీం కోర్టు ఆదేశాలను ఇవ్వగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బేఖాతరు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా, ప్రధాన కార్యదర్శి వంగ మల్లేశంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పట్టణ అధ్యక్షుడు బాలరాజు, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ కౌన్సిలర్లు యెల్ల లక్ష్మీనారాయణ, రాగుల రాములు, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీందర్, కాంగ్రెస్ నాయకులు కళ్యాణచక్రవర్తి, సామల దేవదాస్, కోడం శ్రీనివాస్, గుడ్ల వెంకటేశం, దొంత దేవదాస్, శ్రావణ్, అఫాన్, రఫీక్, ఇమ్రాన్ పాల్గొన్నారు.


సిరిసిల్లలో ధర్నా చేస్తున్న నాయకులు

ప్రతీ ఒక్కరికి వందరోజుల పని కల్పించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 7: ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఒక్కరికి వందరోజుల పని కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో ఈజీఎస్ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 24 గ్రామాలలో ఆడిట్ సిబ్బంది ఉపాధి హామీ పనుల రికార్డులను తనిఖీ చేసి కూలీల నుంచి వివరాలు సేకరించారు. అయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంతో చేసిన తప్పులకు రూ.5 వేల జరిమానా విధించి, రూ.35216 రికవరీ చేసినట్లు డీఆర్‌డీవో వివరించారు. ఎంపీపీ పిల్లి రేణుక, ఎంపీడీవో సత్తయ్య, ఈజీఎస్ విజిలెన్స్ అధికారి రామారావు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, మార్చి 7: మండలంలోని పెద్దలింగాపూర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూంలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభ ద్వారా ఎంపికైన లబ్ధిదారులను ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల లింగన్న, అసెంబ్లీ అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్, మండల అధ్యక్షుడు అమర్, నాయకులు జుట్టు విజయ్‌కుమార్, అరవింద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతితో నిరుపేదల ఇళ్లలో వెలుగులు


జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, మార్చి 7: గృహజ్యోతి పథకంతో నిరుపేదల ఇళ్లలో వెలుగులు వచ్చాయని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని వంతడుపులలో గురువారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారి సమస్యలపై అధికారులతో చర్చించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, నాయకులు గాజుల రాములు, భూపతిరెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఇంటి యజమానులకు ఉచిత విద్యుత్ జీరో కరెంట్ బిల్లు రసీదులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మాలి నర్సయ్య గురువారం అందించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మాజీ ఉపసర్పంచ్ సిరిపురం మహేందర్, నాయకులు దొమ్మాటి రాజు, గోగురి దేవిరెడ్డి, బాబు పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలం అడవి పదిరలో గృహజ్యోతి పథకం కింద అర్హులైన ఇంటి యజమానులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కరెంటు బిల్లు రసీదులను కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఫని శివ రామకృష్ణ గురువారం అందజేశారు. గ్రామ అధ్యక్షుడు నరసింగం, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు

వేములవాడ టౌన్, మార్చి 7 : వేములవాడ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్ అలీ (బాబున్) గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాబున్‌తోపాటు మైనార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాహుల్, ఉపాధ్యాక్షులు ఇబ్రహీం, జాయింట్ ఆర్గనైజర్ ఎండీ షాహిద్ పాషా, ఎండీ రఫీక్, మరో 50 మంది పార్టీలో చేరారు. సంద్రగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేతన్నల రాస్తారోకో

సిరిసిల్ల రూరల్, మార్చి 7 : వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించడంతోపాటు ఆసాములు, కార్మికులను ఆదుకోవాలని నేతన్నలు గురువారం రాస్తారోకో చేశారు. సిరిసిల్ల పట్టణంలో ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆర్డర్‌లతోపాటు బతుకమ్మ చీరల ఆర్డర్‌లను ఇచ్చి ఆదుకోవాలంటూ ఆసాములు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు గురువారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఆసాములతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం దీక్ష శిబిరంలో ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి చేరాల అశోక్ మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమపూర్తిగా మూతపడడంతో ఆసాములు, కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. శివరాత్రి పండుగకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సోమవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు చెప్పారు.

నేతన్నల బతుకులతో ఆడుకోవద్దు

తంగళ్లపల్లి, మార్చి 7: ఉపాధి కల్పించకుండా ప్రభుత్వం నేతన్నల బతుకలతో ఆడుకుంటోందని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ విమర్శించారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నేత కార్మికులు, ఆసాములు సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని, కార్మికులను ఉపాధి కల్పించాలని ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని నెలలుగా కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వస్త్ర పరిశ్రమపై ఆధార పడిన వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, నేతన్నల సంక్షేమానికి శాశ్వత పరిష్కారం చూపకపోవడం ఓ కారణమైతే కొత్త ప్రభుత్వం కూడా ఇప్పటికి వరకు నేతన్నల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మండల ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనె పర్శరాములు. కుడిక్యాల కనకయ్య, అన్నల్‌దాస్ గంగాధర్, సామల నర్సయ్య, గోరంతల రాజమల్లు, కోడం వేణు, గడ్డం ఎల్లయ్య, అంబదాస్, రమేష్, పెంటయ్య, శ్రీనివాస్, రవి, వెంకటేశం, రాజేశం, శంకర్, సత్యం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 7 : నేషనల్ హెల్త్ మిషన్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన రెండో ఏఎన్ఎంలు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, రావాల్సిన జీతాలతోపాటు బకాయిలను ఈ నెల 10వ తేదీలోగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, రెండో ఏఎన్ఎంలు రాణి, సునిత, బాలకృష్ణ, శేఖర్, రేవంత్, చైతన్య, రేణుక, విజయ, అరుణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత


జిల్లా జడ్జి ప్రేమలతను సన్మానిస్తున్న లోక్ అదాలత్ సభ్యులు

సిరిసిల్ల క్రైం, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం సిరిసిల్ల కోర్టులో మానేరు స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత, జూనియర్ సివిల్ జడ్జి సృజన, మహిళా న్యాయవాదులు పుష్పలత, సుష్మ, ఇ.జ్యోతి, నిషాద్ సుల్తానా, ఐశ్వర్య, అరుణ, వై.జ్యోతి, వినిత, కళ్యాణి, అనిల, యమునను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, పెంట శ్రీనివాస్, ఆడేపు వేణు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలపరిషత్ కార్యాలయం, వంతడుపుల, వాణీనికేతన్ హైస్కూల్, వివేకానంద పాఠశాలలో గురువారం మహిళాదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్యయాదవ్, శ్యామలాదేవి, పుష్పలత, సుమలత, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో మిర్జా, ఏపీవో వాణిశ్రీ, పాఠశాలల ప్రిన్సిపాల్స్ తూముకుంట శ్రీనిధి, జిల్లా పండరీనాథ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ మహిళా సిబ్బందిని ఎంపీటీసీ సింగారం మధు గురువారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి సుస్మిత, ఏఎన్ఎం పద్మ, అంగన్‌వాడీ టీచర్ హాలియా, ఆశావర్కర్ సునంద, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, సీఏ వనజ, ఆసియా, రాజవ్వ ఉన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ పడిగెల మానస రాజు ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా సిబ్బందిని సన్మానించారు. మండెలపల్లిలో తాజ మాజీ సర్పంచ్ గనప శివజ్యోతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిత్ కార్యాలయాల్లో మహిళా దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో భాస్కరశర్మ, జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఇంచార్జ్ ఈవో శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదునిక సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. వివిద పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ దాను, ఎన్ఎస్ఎస్ పీవో దర్మపురి పాల్గొన్నారు.ఉన్నారు.

వేములవాడ రూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులను, మండల మహిళా ఎంపీటీసీలను, అధికారులను సన్మానించారు. జడ్పీటీసీ ఏశ వాణి, ఎంపీటీసీ శ్యామల, అగ్రహారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారిణి కె.వై కరుణ, ఐక్యూఏసీ కో ఆర్డి నేటర్ వి. వెంకటేశ్వర్లు , అకాడమిక్ కో ఆర్డినేటర్ మధు రాజేష్, కళాశాల అధ్యాపకులు మల్లారెడ్డి, బ్రాకర్, శ్రీనివాసులు, రాజేష్, నారాయణ, నర్సయ్య, మధుబాబు. దీపిక, అర్జున్, రమేష్ బాబు, ఫకీరాబాబా తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం మూడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సాధన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తిమ్మాపూర్, ఆసిరెడ్డిపల్లి, నర్సింగాపూర్, మూడపల్లి ప్రభుత్వ పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను, మల్యాల స్కూల్‌లో గ్రామ పంచాయతీ మహిళా కార్మికులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో టీచర్లను, ఆశవర్కర్‌లను, గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు.


కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ, మహిళా ప్రజాప్రతినిధులు